క్లుప్తంగా

ప్రమాదస్థాయి దాటితేనే సస్య రక్షణ చేపట్టాలి



కొరుపల్లి పొలంబడిలో పంట పరిస్థితిపై చర్చిస్తున్న ఎంపీఏఓ రాజేష్

కరప: మండలంలోని కొరుపల్లిలో బుధవారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఎంఏఓ రాజేష్ పాల్గొని సార్వాలో రైతులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదవస్థాయి దాటితేనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తెగుళ్ల నివారణకు పరిష్కార మార్గాలను ఆయన సూచించారు.

సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ కల్చరల్: సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రి కళాప్రాంగణంలో ఈ నెల పదో తేదీన విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దాడి చంద్రశేఖర్ తెలిపారు. పోటీలు జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా నిర్వహిస్తామని తెలిపారు. 6 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు జూనియర్స్‌గాను, 9 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు సీనియర్స్ విభాగంగా పరిగణిస్తామని తెలిపారు. అలాగే ఉత్తమ హిందీ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 81797 86635 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అచ్చంపేట జంక్షన్‌లో హోటళ్ల తనిఖీ

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్‌లో మూడు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారి కేవీ సుబ్బారావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి నోటీసులు ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఆయా హోటళ్లపై వచ్చిన ఫిర్యాదు మేరకు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆదేశాలతో ఈ తనిఖీలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

నేత్రదాన పక్షోత్సవాలపై అవగాహన



వివేకానంద పార్కులో అవగాహన కల్పిస్తున్న ఐ బ్యాంకు ప్రతినిధులు

బాలాజీచెరువు: అంధత్వ రహిత జిల్లాగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐబ్యాంక్ కార్యదర్శి దాసరి సాయికృష్ణ పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించిన నేత్రదాన అవగాహన కరపత్రాలు నగరంలోని పలు పార్కులలో వాకర్లు, పాదచారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ ఐ బ్యాంక్ ద్వారా అందిస్తున్న కంటి వైద్య సేవలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐబ్యాంక్ ట్రస్టీలు సీమకుర్తి పాపారావు, పైడా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఖైదీలకు వైద్య పరీక్షలకు చర్యలు

పెద్దాపురం: బయట సమాజంలో ఉన్న వ్యక్తులకే కాకుండా జైలులో ఉంటున్న ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు స్థానిక సబ్‌జైలు అధికారి వై.శ్రావణ్‌కుమార్, ఏరియా ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్లు బి.శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి పీడీ, డైరెక్టర్ జనరల్ జైల్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైలులో ఉన్న వారికి కూడా మంచి ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఖైదీలకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పలు వ్యాధులపై ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఎల్‌టి ఓలేటి ఏసుబాబు, వైజ్ మేనేజర్ రాజు, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

కొత్తపల్లి: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పశువైద్యాధికారి ఎస్. సందీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో పాడి రైతులకు బుధవారం ప్రభుత్వం ద్వారా లభించే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. టీఎంఆర్ సంపూర్ణ దాణామృతం పథకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం టీఎంఆర్‌ను సబ్సిడీపై పాడి రైతులకు అందిస్తోందన్నారు. కేజీ దాణా రూ.15.80 కాగా ప్రభుత్వం రూ.9.30 సబ్సిడీతో పాడి రైతులకు రూ.6.50కే అందిస్తోందని తెలిపారు. ఒక్కో రైతు 1800 కేజీల వరకూ సబ్సిడీ పొందవచ్చాన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వాకలపూడిలో ఉట్టి కొడుతున్న చిన్నారి గోపాలుడు



శ్రీకృష్ణ వేషధారణలోని చిన్నారులతో భారతి ఫౌండేషన్ సభ్యులు



సత్కళావాహినిలో కీర్తనలు ఆలపిస్తున్న మంజరి సంగీత కళాశాల విద్యార్థులు


నవనీత చోరా నందగోపాలా

- వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు
- అల్లరి చేసిన బుల్లి కన్నయ్యలు, చిన్నారి గోపెమ్మలు
- ఉట్టికొట్టు సంబరంలో వెల్లివిరిసిన ఉత్సాహం

కాకినాడ రూరల్: శ్రీకృష్ణాష్టమి అంటేనే చిన్నారులకు పండగ. బుడిబుడి అడుగులు వేసే తమ పిల్లలను కృష్ణుడిగా, గోపికలుగా తయారు చేసి తల్లిదండ్రులు మురిసిపోతారు. సాంప్రదాయం ఉట్టి పడేలా గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి నిర్వహించారు. యాదవ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిరాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు మిఠాయిలు పంచారు. అడబాల రత్నప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ యాదవ యువజన కమిటీ ఆధ్వర్యంలో స్వామివారిని ఊరేగిస్తున్న చిన్నారులు



ప్రత్యేక అలంకరణలో గోకులంలోని శ్రీకృష్ణుడు

నగరంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

బోట్‌క్లబ్: నగరంలో కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఎంతో వైభవంగా నిర్వహించారు. కృష్ణుని ఆలయాల్లో ఉదయం స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ఆలయానికి తీసుకొచ్చారు. స్థానిక అశోక్ నగర్ గోకులంలో ఉదయం గోపూజ, సహస్ర పుష్పార్చన, నవగ్రహ ఆరాధన, అష్ట కలశ స్నపనాభిషేకం, సహస్ర తులసీ దళార్చన, పూర్ణాహుతి నిర్వహించారు. గోకులం అధ్యక్షులు నారాయణం మురళి ఏర్పాట్లు చేశారు. అచ్యుతాపురం గేటు సమీపంలో శ్రీకృష్ణుని మందిరంలో, రామారావుపేట శివాలయం సమీపంలో ఉన్న కృష్ణుని ఆలయంలో, సినిమా రోడ్డు సమీపంలోని కృష్ణాలయాల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. జేఎన్‌టీయూకే ఎదురుగా ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు పదో తేదీ వరకూ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



జేఎన్‌టీయూకే ఎదురుగా ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

శ్రీకృష్ణ యాదవ యువజన కమిటీ ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: స్థానిక జగన్నాథపురం కూరాకులవారి వీధిలో శ్రీకృష్ణ యాదవ యువజన కమిటీ ఆధ్వర్యంలో మేళ తాళాలు, బాజా భజంత్రీలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ సూపర్ బజార్ డైరెక్టర్ మన్యం నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామికి పుష్పాలంకరణ చేశారు. యాదవులు ఐక్యంగా ముందుకు సాగాలని నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్ల కృష్ణ, మల్లిపూడి శివాజీ, చిట్టిమేను శ్రీనివాసరావు, మట్టా రామకృష్ణ, కుందల్ కాశీ, పుట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

సత్కళలో అలరించిన కన్నయ్యలు..

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో బుధవారం శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణామాచార్యులు వేడుకలను ప్రారంభించారు. సాయంత్రం శ్రీకృష్ణ భక్తి గీతాలతో ఆలపించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. తదుపరి సంకురాత్రి మంజరి సంగీత కళాశాల విద్యార్థులచే ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ గానామృతం సంగీత కచేరి ఆకట్టుకొంది. విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కుంజుక లక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు.

స్థానిక రామారావుపేటలోని మునుసూరి సుబ్బారావు, శ్రీమతి రావమ్మ కల్యాణమండపంలో బుధవారం సంస్కార భారతి, ది గోదావరి కళా కౌముది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. శ్రీకృష్ణ వేషధారణలో విద్యార్థులు అలరించారు. చిన్నారులు ఆలపించిన శ్రీకృష్ణ శతక పద్యాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ తత్వాన్ని, శ్రీకృష్ణలీలలను మార్ని జానకీరామ్ చౌదరి వివరించారు. పోటీలలో విజేతలకు ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి బాజిబోయిన వెంకటేష్ నాయుడు సర్టిఫికెట్లు, మెమెంటోలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి ఉపాధ్యక్షురాలు సాయిలక్ష్మి, తురగా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కన్నబాబును కలిసిన సాయి



ఎమ్మెల్యే కన్నబాబుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న సాయి

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పిఠాపురానికి చెందిన బత్తుల నాగ సాయిరామ్ (సాయి) బుధవారం ఉదయం రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రిగా తన నియామకానికి సహకరించినందుకు కన్నబాబుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. సాయిని కన్నబాబు అభినందించి, బాధ్యతయుతంగా పనిచేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పన శివ పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలలో సత్తా

3 బంగారు, 2 రజత, 2 కాంస్య పతకాలు సొంతం



పతకాలు సాధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈ నెల 2 నుంచి 4 వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనబరిచారు. జిల్లా తైక్వాండో సంఘ కార్యదర్శి, కోచ్, జాతీయస్థాయి రిఫరీ బి.అర్జునరావు వద్ద శిక్షణ పొందుతున్న బి.శ్రీస్నేహ 1 బంగారు, 1 రజత, ఎస్.మోక్షజ్ఞ 1 బంగారు, జి.యశ్విత 1 కాంస్య, వై.సాక్షికుమారి 1 రజత పతకం కైవసం చేసుకున్నారు. బాలుర విభాగంలో బి.హర్షవర్ధన్ 1 బంగారు, బి.నాగదీపక్ చరణ్ 1 కాంస్య పతకం అందుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కార్యదర్శి కె.స్వర్ణసరాజు, డీఎస్ఏ సీఈఓ రమణి, ముఖ్యశిక్షకులు బి.శ్రీనివాస్‌కుమార్, జాతీయస్థాయి రిఫరీలు మూర్తి, బి.అఖిల, ఎన్.తులసి బుధవారం అభినందించారు.

కష్టాన్ని చూసి చలించి..

- 12 గంటల్లో దివ్యాంగుడికి ట్రైసైకిల్
- ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవతో రోటరీ గోల్డెన్ జుబ్లీ క్లబ్ వితరణ



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అతనో నిరుపేద దివ్యాంగుడు. చేతిలో ట్రైసైకిల్ లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాడు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' అతని సమస్యకు పరిష్కారాన్ని చూపింది. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అతనికి ట్రైసైకిల్ సమకూర్చి అతని కష్టానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం 38వ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటిస్తుండగా కచ్చేరిపేట ప్రాంతానికి చెందిన రవీంద్ర ఆయనకు తారసపడి తన గోడు వివరించాడు. అతని సమస్య విన్న ద్వారంపూడి కాకినాడ రోటరీ గోల్డెన్ జుబ్లీ క్లబ్‌ను సంప్రదించి అతనికి బుధవారం ఉదయానికి రూ.10వేల విలువైన ట్రైసైకిల్‌ను సమకూర్చారు. ఎమ్మెల్యే తన నివాసం వద్ద క్లబ్ సభ్యులు రవిరెడ్డి, బాలాప్రసాద్ సమక్షంలో రవీంద్రకు రొటేరియన్ లంక సాయిబాబా ఆర్థిక సహకారంతో ట్రైసైకిల్‌ను అందజేశారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే ద్వారంపూడి, రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నరహరశెట్టి రవికృష్ణ, చందులకు రవీంద్ర ధన్యవాదాలు చెప్పాడు. జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ రోకళ్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- 'గడప గడప'లో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో బుధవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను కలిసి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి, ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సి వచ్చేదని, తమ ప్రభుత్వంలో అటువంటి పద్ధతికి ఆస్కారం లేకుండా చేశారన్నారు. పింఛన్లను నేరుగా వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు అందజేయడం, ఇతర పథకాలను ఖాతాల్లో జమ చేయడం వంటి పారదర్శక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. అంతటి పాలన చేస్తున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), ఆర్యవైశ్య మహాసభ అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాదం మధు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బీకే రెడ్డి, శివాలయం చైర్మన్ రమేష్, స్థానిక నాయకులు కుమారి, పడాల వీరబాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

సర్పవరంలో ఆక్రమణల సర్వే



పీనుగుల పుంత ఆక్రమణలపై డీపీఓ విక్టర్, తహసీల్దార్ మురార్జీ ఆధ్వర్యంలో సాగుతున్న సర్వే

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో పీనుగుల పుంత ఆక్రమణలపై హైకోర్టు ఆదేశాల మేరకు పంచాయతీ, రెవెన్యూ అధికారులు బుధవారం కొలతలు తీసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామ సెంటరు వరకు సర్వే చేశారు. సర్వేలో డీపీఓ విక్టర్, తహసీల్దార్ మురార్జీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వీఆర్వో సాయి, సర్వేయర్ గోపాలాచార్యులు పాల్గొన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ సర్వే నంబరు 34లో పీనుగుల పుంత ఆక్రమణలో ఉందని, చాలా అసౌకర్యానికి గురవుతున్నామని, వాటిని తొలగించాలని సర్పవరానికి చెందిన పుల్ల సత్తిబాబు హైకోర్టు ఆశ్రయించారని, ఈ మేరకు విచారణ చేశామని, నివేదికను హైకోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. కాగా పీనుగుల పుంత మొత్తం ఆక్రమణలపై కాకుండా కేవలం దళితులకు చెందిన నాలుగు ఇళ్లకు సంబంధించి పేర్లతో హైకోర్టును ఆశ్రయించడాన్ని తాము ఖండిస్తున్నామని స్థానిక దళిత నాయకుడు విజయకుమార్ అన్నారు.

పదో తేదీ నుంచి ఇంటింటా ధర్మ ప్రచారం



సమరసత సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కరప: బ్రిటిష్ వారు భారతదేశాన్ని వదిలి 77 ఏళ్లు అవుతున్నా వారి ఆనవాళ్లు, ఆచారాలు ఇంకా పోలేదని అందుకనే చాలా మంది భారతదేశం మాది కాదనుకునే భ్రమలో ఉన్నారని సమరసత సేవా ఫౌండేషన్ కాకినాడ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు అన్నారు. మండలం కరప నీలయ్య తోటలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కించపరిచే పరిస్థితికి సొంత దేశానికి చెందిన వారే దిగజారుతున్నారన్నారు. వారిలో చైతన్యం తీసుకుని రావడం కోసం ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు ఇంటింటి ధర్మ ప్రచారం మొదలుపెడుతున్నట్టు తెలిపారు. మన దేశంలో కార్మిక దినోత్సవం అంటే విశ్వకర్మ జయంతి రోజునే చేసుకోవాలని,ఈనెల 17వ తేదీన విశ్వకర్మ జయంతి వస్తుందన్నారు. అనేక చేతి వృత్తులు వారిని సత్కరించే కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు రఘు తెలిపారు. సమావేశంలో ధర్మ ప్రచారకులు ముమ్మిడి శ్యామ్‌సుందరరావు, ముమ్మిడి పెద్దకాపు, కొక్కెరమెట్ల రామకృష్ణ, నల్లె శ్రీమన్నారాయణ, హారతి, గొల్లపల్లి కమల, కొప్పల బుల్లయ్య, లకమని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల సేవలు ఆదర్శనీయం

కాకినాడ కల్చరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధీభవన్ వ్యవస్థాపకుడు స్వర్గీయ తనికెళ్ల సత్యనారాయణమూర్తి సమాజ సేవలు ఆదర్శనీయమని గాంధీభవన్ పాలక మండలి అధ్యక్షుడు వీఎల్ గాంధీ అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో తనికెళ్ల వర్ధంతిని బుధవారం నిర్వహించి నివాళులు అర్పించారు. తనికెళ్ల చేసిన సేవలను వక్తలు కొనియాడారు. పాలక మండలి సభ్యులు అల్లూరి సురేంద్ర, ఆలపాటి శ్రీనివాస్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు బాసటగా నిలచిన యూట్యూబ్



బాలిక వైద్యానికి చెక్ అందజేస్తున్న సతీష్, హరీష్, దీపిక

కాకినాడ క్రైం: ఓ యూట్యూబ్ ఛానల్ ఓ బాలిక నిండు ప్రాణానికి బాసటగా నిలచింది. స్థానిక వెంకట్ నగర్‌కు చెందిన దొర, సత్యదేవి దంపతులకు తొమ్మిదేళ్ల కుమార్తె శివాత్మిక ఉంది. ఆమె వెన్నెముక సంబంధ అనారోగ్య సమస్యతో బాధపడుతోంది. ఆమె వైద్యానికి రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు బొల్లం సతీష్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన బాబు పెరల్స్ యజమానులు హరీష్, దీపిక దంపతులకు బాలిక సమస్య వివరించారు. హరీష్ దంపతులు వారి సంస్థ పేరున నిర్వహిస్తున్న యూట్యూబ్ చానల్‌లో పాప పరిస్థితిని వివరిస్తూ పోస్ట్ పెట్టారు. ఈ మేరకు సబ్‌స్క్రైబర్లు స్పందించి పంపిన రూ.1.6 లక్షల మొత్తాన్ని బుధవారం చెక్ రూపంలో బాలిక తల్లిదండ్రులకు బాబు పెరల్స్ షోరూంలో వారు అందజేశారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: శిక్షణతో అనేక కొత్త విషయాలు తెలుస్తాయని, ప్రతి ఒక్కరూ శిక్షణపై పూర్తి బాధ్యతతో వ్యవహరించి సద్వినియోగం చేసుకోవాలని పిఠాపురం మున్సిపల్ నోడల్ అధికారి సీహెచ్ సుజాత అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలలోని సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న ఏడో బ్యాచ్ శిక్షణ బుధవారంతో ముగిసింది. ప్రభుత్వం సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణను సీరియస్‌గా తీసుకుని నేర్చుకోవాలన్నారు. ఫ్యాకల్టీ శ్రీకైలాస్ శిక్షణ ఇవ్వగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు యు.జ్యోతి రామ్, ఎస్‌పీ రామారావు, కె శ్రీనివాసరావు, కేపీ ప్రసన్న పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.